క్లుప్తంగా

25న మండల సర్వసభ్య సమావేశం

కాటారం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25న ఎంపీపీ పంతకాని సమ్మయ్య అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వసభ్య సమావేశంలో మండలానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

నియామకం

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థాన చైర్మన్‌గా గ్రామానికి చెందిన రంగు రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామానికి చెందిన పలువురు సోమవారం ఆంజనేయస్వామి ఆలయంలో సమావేశం ఏర్పాటు చేసుకుని కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అదే విధంగా పాలక మండలి సభ్యులుగా ఠాకూర్ లక్ష్మన్, వెన్నపురెడ్డి సాంబశివరెడ్డి, జంగపల్లి వెంకటయ్య, రాజయ్య, ఇనుముల మల్లేష్, అజ్మీరా ధరమ్‌సింగ్, వావిళ్ల రమేష్, జాగరి కమలాకర్, అంతటి రవి, మామిల్లపల్లి శ్రీనివాస్, ముదురుకోళ్ల రవి, మాలోత్ నవరాంనాయక్, ఐర్నేని భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని పూజారి కాగితపు వెంకటాచారి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయస్వామి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

టికెట్లు కౌంటర్ల ద్వారా విక్రయించాలి

భూపాలపల్లి అర్బన్: ఉప్పల్‌లోని గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నిర్వహించనున్న ఐపీఎల్ మ్యాచ్‌కి సంబంధించిన టికెట్లు సాధారణ ధరలకు కౌంటర్ల ద్వారా విక్రయాలు చేపట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల 25న జరగాల్సిన ఐపీఎల్ మ్యాచ్‌కి సబంధించిన టికెట్లను పేటీఎంలో అమ్మకానికి ఉంచిన క్షణాల్లోనే అమ్ముడుపోయాయని హెచ్‌సీఏ బోర్డు ప్రకటించినట్లు తెలిపారు. 36వేలకు పైగా టికెట్లను అమ్మకానికి ఉంచిన అరగంటలోపూ ఏవిధంగా అమ్ముడుపోయతాయో హెచ్‌సీఏ, సన్‌రైజర్స్ యాజమాన్యాలు ప్రజలకు స్పష్టం చేయాలని ప్రశ్నించారు. బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించారని బోర్డు కమిటీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతున్న పంచాయతీ కార్యదర్శి మృతి


శ్రావణి (ఫైల్)

గణపురం: ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శి పల్లెబోయిన శ్రావణి(26) చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కర్కపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న శ్రావణి గాంధీనగర్ గ్రామంలో తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటుంది. ఇంట్లో ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా భర్త, స్థానికుల సాయంతో చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. శ్రావణి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు ఇప్పటి వరకు తెలియరాలేదు. కలెక్టర్, పోలీసులు ఘటనపై స్పందించి ఆత్మహత్య ఘటన కారణాలపై విచారణ చేపట్టారు. కాగా, శ్రావణి వాడిన ఫోన్ దొరకకపోవడంతో పోలీసుల దర్యాప్తులో జాప్యం జరుగుతుంది. ఆదివారం ఉదయం ఆమె ఎవరితో ఫోన్ మాట్లాడింది, ఆమె ఆత్మహత్యాయత్నానికి కారణం ఏమిటనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. మృతురాలికి భర్త నరేష్, ఒక పాప, బాబు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వాజేడు: మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, డిప్యూటీ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మ పరిశీలించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని పలు పాఠశాలలను వారి చూశారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉన్నది లేనిది పరిశీలన చేశారు.

మద్యం పట్టివేత

ఏటూరునాగారం: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద సోమవారం ఎక్సైజ్ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా వస్రా నుంచి వాజేడు మండలంలోని ఘణపురం గ్రామానికి రూ.15వేలు విలువ చేసే మద్యాన్ని వస్రాకు చెందిన కుమ్మరి గోపీచంద్ తనవాహనంపై ఎలాంటి అనుమతి లేకుండా మద్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం స్వాధీనం చేసుకొని ద్విచక్రవాహనం సీజ్ చేసి అతడిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

11 మంది బైండోవర్

అలాగే 11 మంది నాటుసారా అమ్మకం, తయారీ చేసినందుకు కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలంలోని తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. బైండోవర్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుపతి, నవీన్, శ్రీనివాస్, ప్రణయ్, నాగరాజు, ట్రైనింగ్ కానిస్టేబుల్ ప్రవళిక పాల్గొన్నారు.

నిరుపయోగంగా నీటితొట్లు

- తీరని పశువుల దాహం
- పట్టించుకోని అధికారులు


మల్లారంలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టె

మల్హర్: పశువుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం గ్రామాల్లో నీటి తొట్లను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణ బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పగించింది. అవసరం మేరకు వాటి మరమ్మతులు చేయంచేందకు నిధులు కేటాయించక పోవడంతో అవి పూర్తిగా శిథిలావస్థకు చేరుకోగ, మరికొన్ని చోట్ల నిరుపయోగంగా ఉంటున్నాయి. దీంతో పశువుల దాహార్తి తీరడం లేదు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

నిర్వహణ భారం

మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో పశువుల దాహార్తి తీర్చేందుకు గతంలో దాదాపు 14 నీటి తొట్టెను నిర్మించారు. పైపులైన్ పగిలిపోవడం, మోటార్ పాడైపోవడం, తొట్లు పగిలి పోవడం వంటి కారణాలతో పంచాయతీలకు భారంగా మారాయి. గ్రామాలో నిర్మించిన నీటి తొట్లల్లో దాదాపు ఒక్కటి కూడా పనిచేయడం లేదు. మండలంలో మాల్లారం జిల్లా పరిషత్ పాఠశాల ముందు, మల్లారం ఉర చెరువు సమీపంలోని రహదారి పక్కన తదితర ప్రదేశాల్లో నిర్మించిన తొట్లు నిరుపయోగంగా మారాయి. అలాగే తాడిచర్లలోని పెంజేరువులో నిర్మించిన తొట్టె పూర్తిగా పగిలి పాయింది. పగిలిన నీటి తొట్టెలను మరమ్మతులు చేయించి మోటారు సౌకర్యం కల్పించి నీరు అందించాలని పశుపోషకులు కోరుతున్నారు. నిర్మించిన నీటి తొట్లలకు నిర్వహణ భారంతో నిరుపయోగంగా మారుతుండంతో అవి అలంకారప్రాయంగా మారుతున్నాయి. ఇకనైన అధికారులు స్పందించి నిధులు వెచ్చించి నీటి తొట్టెలను వినియోగంలోకి తీసుకరావాలని రైతులు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



వేసవి కావడంతో చెరువులు పూర్తిగా ఎండిపోయి పశువులు నీరు దొరకక ఇబ్బందులు పడుతున్నాయి. నీటి తొట్టెలకు మరమ్మతులు చేపట్టి, పైప్‌లైన్ ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలి

- యశాడపు ఓదెలు, తాడిచర్ల, మల్హర్

రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

చిట్యాల: యాసంగి ధాన్యం విక్రయాలలో రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అందుకుతండా, గిద్దెముత్తారం గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని.. రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం తడవకుండా తగు చర్యలు చేపట్టాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. పంటకు మద్దతు ధర చెల్లించాలని సూచించారు. జిల్లాలో 189 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2,203, బీ గ్రేడ్ రకానికి రూ.2,183 మద్దతు ధర కల్పించినట్లు పేర్కొన్నారు. ఎవ్వరైనా తక్కువ ధరకు కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ఒకేసారి మూకుమ్మడిగా ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకురాకుండా దశల వారీగా వ్యవసాయ అధికారులు సూచించిన తేదీలలో తీసుకరావాలని చెప్పారు. ఆయన వెంట సీఓ మొగిలి, ఏఈఓ సందీప్, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మొగుళ్లపల్లి: కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో సోమవారం మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొగుళ్లపల్లి మాజీ సర్పంచ్ మోటె ధర్మారావుతో పాటు ఆకుల వీరన్న, జనార్దన్, చంద్రబోస్, శ్యాంరావు, చాట్ల రవి, కిషన్, శివాజీ, శ్రీధర్, తదితరులు చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సాంబమూర్తి, అప్పం కిషన్, పట్టణ అధ్యక్షులు క్యాతరాజు రమేష్, తక్కళ్లపల్లి రాజు, పున్నం చందర్‌రావు, రఫీ,శివారెడ్డి, రవి,శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన


భూపాలపల్లి రూరల్: ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు


టేకుమట్లలో..

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని ఆజాంనగర్ మహర్షి పాఠశాలలో 21 మంది విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. మహాత్మా జ్యోతిభాపూలే గురుకులం 5వ తరగతి చదువుకోవడానికి 25 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 21మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. సోమవారం ఎంపికైనా విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయలు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మెమోంటోలు ఇచ్చారు. గ్రామస్తులు పాఠశాల అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కవిత, లక్ష్మి, వనిత, రాజు, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పబ్లిక్ స్కూల్‌లో ఇటీవల సైనిక్-3, నవోదయ-1, గురుకుల పాఠశాలలో 32 సీట్లు సాధించిన విద్యార్థులను నాయకులు, తల్లిదండ్రులు అభినందించి సన్మానించారు. సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మియాపురం హరీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ పాఠశాల నుంచి విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన వ్యాపారి కటకం విజయ్ కుమార్ అతడి కూతురు, కొడుకు జన్మదినం సందర్భంగా పాఠశాలకు బీరువాను బహుమతిగా అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు కోటగిరి సతీష్‌ను, విజయ్‌కుమార్‌ను శాలువతో సన్మానించారు.

రహదారులే కల్లాలు!


ప్రమాదకరంగా రోడ్డుపై ధాన్యం, పశుగ్రాసం

టేకుమట్ల: యాసంగిలో వరికోతలు ప్రారంభమైనా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో పాటు, కనీసం ధాన్యాన్ని ఆరబెట్టేందుకు మైదానం లేకపోవడంతో రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. యాసంగిలో ఎక్కువగా ఆడ, మగ వరి వంగడాలను పండించడంతో ముందుగా మగ వరి సాల్లను కోసి రోడ్లపైనే వేస్తున్నారు. దాంతో ధాన్యం, పశుగ్రాసంతో ప్రధాన రోడ్లు నిండుకుంటున్నాయి. మండలంలోని గర్మిళ్ళపల్లి-రాఘవాపూర్ ప్రధాన రోడ్డులో ఒక వైపు ధాన్యం, మరో వైపు పశుగ్రాసంతో నిండుకుంది. రైతు కష్టాలు అలా ఉంటే దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ద్విచక్ర వాహనదారులు పశుగ్రాసం పైనుంచి కానీ, ధాన్యం పైనుంచి కానీ ప్రయాణిస్తే ప్రమాదవశాత్తు పడిపోయే ప్రమాదం ఉంది. రైతులు వారి అవసరాలకు రోడ్డును ఒకవైపు మాత్రమే వినియోగించుకుంటే ప్రమాదాలను కొంత వరకు నివారించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి


వినతిపత్రం అందజేస్తున్న బాధిత రైతులు

భూపాలపల్లి అర్బన్: జంగేడు శివారులో అక్రమంగా భూములను కబ్జాచేసి పట్టాలు చేసుకున్న వారిని తొలగించి తమకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని కాశీంపల్లి గ్రామానికి చెందిన బాధిత రైతులు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జంగేడు శివారులోని 1630, 1631, 1632, 1647 సర్వే నంబర్లలోని 14మంది రైతులకు చెందిన 40 ఎకరాల వ్యవసాయ భూమిని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కొత్త హరిబాబు, అతని అనుచరులు బొంతల సతీష్, మేనం రాజేందర్, మాడ ప్రతాప్‌రెడ్డి, వారి బంధువుల పేర్లమీద అక్రమంగా పట్టాలు చేయించుకున్నారని పేర్కొన్నారు. కొత్త హరిబాబు బెదిరించి 23మంది రైతులతో తెల్లకాగితంపై సంతకాలు చేయించుకొని భూమిని అక్రమంగా లాక్కున్నారని బాధితులు ఆవేదన వ్యక్తంచేశారు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని రైతులు ఉడత రాయమల్లు, రాయలింగు, స్వరూప, జోరు కొమురయ్య, రాజు, లక్ష్మి, భూమయ్య, పెద్ద సమ్మయ్య కోరారు.

నేడు కార్నర్ మీటింగ్

మహాముత్తారం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నేడు(మంగళవారం) మహాముత్తారం మండలంలోని యామన్‌పల్లి ప్రధాన కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సడువలి, జెడ్పీటీసీ లింగమల్ల శారద, ఎంపీపీ సుభద్ర సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీతోపాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు హాజరుకానున్నట్లు వారు తెలిపారు.

తాడిచర్లలో..

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల హనుమాన్ సెంటర్‌లో కాంగ్రెస్ యువ నాయకుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శీనుబాబు అధ్యక్షతన నేడు(మంగళవారం) కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 7.30 గంటలకు నిర్వహించే సమావేశానికి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ


తనిఖీ చేస్తున్న పోలీసులు

కాళేశ్వరం: కాళేశ్వరం అంతరాష్ట్ర వంతెన సమీపంలోని బార్డర్ చెక్‌పోస్టు వద్ద ఎస్సై భవానిసేన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేశారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి తరలివస్తున్న వాహనాలపై ప్రత్యేక దృష్టిసారించి సోదాలు నిర్వహించారు. అనుమానితులు కనిపిస్తే విచారించి వదిలేశారు. ఆయన వెంట ఏఎస్సై రాజేశం, సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



చిట్యాల: మండలకేంద్రానికి చెందిన చింతల మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మృతుడి కుటుంబసభ్యులను సోమవారం పరామర్శించారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా, మండల నాయకులు చింతల రమేష్, పువ్వాటి హరికృష్ణ, గురుకుంట్ల కిరణ్, కొడెల రాయమల్లు, ఉప్పుల కిరణ్, కొత్త శ్రీనివాస్, తణుకు మధు ఉన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ భవేష్‌మిశ్రా


కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న చిన్నారి తల్లిదండ్రులు

భూపాలపల్లి: ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 36 దరకాస్తులను కలెక్టర్ స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. శాఖలవారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కృతజ్ఞతలు తెలిపిన అక్షయ తల్లిదండ్రులు..

చిన్నారి అక్షయకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని కలెక్టర్ భవేష్‌మిశ్రా హామీ ఇచ్చినందుకు చిన్నారి తల్లిదండ్రులు సోమవారం కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శస్త్ర చికిత్సకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

బీజేపీతోనే దేశంలో సురక్షిత పాలన


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నాయకులు

భూపాలపల్లి రూరల్: బీజేపీతోనే దేశంలో సురక్షిత పాలన సాధ్యమని ఓబీసీ మోర్చాజిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని 17వవార్డు సుభాష్ కాలనీలో బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి రావడానికి ప్రజలను మోసం చేస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం బయట పడుతుందని తెలిపారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కేసీఆర్ మీద నమ్మకం లేక ఒక్కొక్కరుగా పార్టీని వీడిపోతున్నారన్నారు. కాంగ్రెస్ బీఆర్‌ఎస్ కేవలం ఓట్ల కోసం ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యాయని పేర్కొన్నారు. ప్రజలు ఆ రెండు పార్టీలకు ఈ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పనున్నారన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు బ్రహ్మరథం పట్టి విజయాన్ని ఇవ్వబోతున్నారన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తాండ్ర హరీష్, చెటగొపన అర్జున్, సిలువేరు కార్తిక్, గట్ల శ్రీనివాస్, ఆవుల సంతోష్, రాజేష్, శ్రీకాంత్, వేణు, శ్రీధర్, రవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి


కూలీలకు అవగాహన కల్పిస్తున్న రమాదేవి

రేగొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం క్షేత్ర సిబ్బంది లంసాని రమాదేవి అన్నారు. మండలంలోని నారాయణపూర్ గ్రామస్తులకు, బీసీఐ రైతులకు, వ్యవసాయ అనుబంధ కూలీలకు సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు విచ్చలవిడిగా పురుగు మందులు వినియోగించడం వలన పర్యావరణ కాలుష్యం అవుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ ఆధారిత వస్తువులను పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో నవచైతన్య సొసైటీ పాలక వర్గ సభ్యులు మోటం మొగిలి, ఐలయ్య, కారోబార్ తిరుపతి, బీసీఐ రైతులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ ఆశాజ్యోతి

టేకుమట్ల: ఎండకాలంలో వడదెబ్బ సోకకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెలిశాల డాక్టర్ ఆశాజ్యోతి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎండతీవ్రత ఎక్కువగా ఉందని అన్నారు. మండలంలోని ఉపాధి కూలీలు, వ్యవసాయ కూలీలు, ప్రజలు ఉదయం పూటనే పనులు ఉంటే 11 గంటల లోపు పూర్తి చేసుకుని రావాలని కోరారు. అలాగే సాయంత్రం పూట మళ్లీ వెళ్లీ పనులు చేసుకోవచ్చని తెలిపారు. అంతే తప్ప ఎండలో తిరుగుతూ ఇబ్బందులు పడకూడదని అన్నారు. ఒకవేళ అత్యవసర పనిమీద వెళ్లితే తలకు టోపి పెట్టుకోవాలని లేదా గొడుగు వెంటపెట్టుకోవాలని సూచించారు. అలాగే తెల్లని దుస్తులు ధరించాలని అన్నారు. ఒకవేళ వడదెబ్బ తాకినచో దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మధురిమ, వైద్యసిబ్బంది జమలుద్దీన్, కృష్ణారెడ్డి, సతీష్, సంగీత, రాజ్యలక్ష్మీ, ఆశ వర్కర్లు, వెలిశాల ఆదర్శ గ్రామ ఐక్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అభినవ్

కాటారం: శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మ్యాక అభినవ్ అన్నారు. మండలంలోని దేవరాంపల్లిలో సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాటారం, కొయ్యూర్, మహాముత్తారం ఎస్సైల ఆధ్వర్యంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు గ్రామంలో పెద్ద ఎత్తున తనిఖీలు నిర్వహించారు. ఇంటింటా సోదాలు నిర్వహించి గ్రామస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుమానితుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలను, 8 నంబర్ ప్లేట్ లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి గొడవలకు పాల్పడవద్దని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానితులు ఎవరైన గ్రామంలో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం, కొయ్యూర్, మహాముత్తారం ఎస్సైలు హరికిషన్, నరేశ్, మహేందర్, సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

వాజేడు : వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని, బాటసారులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ శ్రీకాంత్‌నాయుడు అన్నారు. మండల పరిధిలోని చెరుకూరులో గ్రామపంచాయతీ అధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మ ఉన్నారు.